

డోర్నకల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

# ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- ఆగస్టు 15న రుణమాఫీ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మరోమోసం
- ప్రజల్లో వ్యతిరేకతను చూసే ఒట్లు పెడుతున్నాడు
- బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలి
- కేసీఆర్ రోడ్డు షోను విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం ఆయన డోర్నకల్ మండలంలోని బంజర, అమ్మపాలెం గ్రామాల్లో, డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రెడ్యా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, నాలుగు నెలలు దాటినా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. గత డిసెంబర్ 9న రైతులకు రూ.2లక్షలు రుణ మాఫీ చేస్తామని చెప్పి.., ఇప్పుడు ఆగస్టు 15 అంటూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. రైతుబంధు, వరి పంటకు రూ.500 బోనస్ ఇప్పటివరకూ ఇవ్వకుండా ఓట్లు ఎలా అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగ్యారెంటీలు, 420 హామీల్లో ఏ ఒక్క హామీనైనా అమలు చేశారా.. ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ప్రజల్లో వ్యతిరేకత రావడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు. 15 రోజులపాటు బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలన్నారు. మే ఒకటిన మహబూబాబాద్ లో జరుగనున్న కేసీఆర్ రోడ్డు షోను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్ , మండల అధ్యక్షుడు నున్న రమణ, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, కౌన్సిలర్లు శరత్‌బాబు, తేజావత్ సంధ్యారాణి, కందుల అరుణ, కాలా మౌనికాజైన్, కొత్త రాధిక, హేమచంద్రశేఖర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మారబోయిన రాంభద్రం, అజిత్ మియా, మల్లికాంబ, నాయకులు మాన్యా పాట్టి, రమేశ్, కొత్త వీరన్న, యశోధర్ జైన్, శేఖర్, కృష్ణమూర్తి, గణేశ్ ఠాగూర్, కాడెం ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి

# మతోన్మాద బీజేపీని ఓడించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీని ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో పదేళ్ల బీజేపీ పాలనలో పేదలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అందించకపోగా, అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకోవడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 3న జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నామని, కార్యకర్తలందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్లు సుధాకర్‌రెడ్డి, అజయ్‌సారథి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగుకుమార్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మి పాల్గొన్నారు.

## ధాన్యం తాలు పడుతుండగా ఫ్యాన్ తగిలి యువకుడి మృతి

దంతాలపల్లి, ఏప్రిల్ 28: వరి ధాన్యం(వడ్లు) తాలు పడుతున్న క్రమంలో యువకుడు మృతి చెందిన ఘటన దంతాలపల్లి మండలంలో ఆదివారం జరిగింది. ఎస్సై కరుణాకర్ కథనం ప్రకారం.. మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మోగ్యతండాకు చెందిన భూక్యా వెంకన్న-పార్వతి దంపతుల కొడుకు ఈశ్వర్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావడంతో రామవరం గ్రామంలో ఓ రైతుకు వడ్లు తాలు పట్టేందుకు కూలీకి వెళ్లాడు. వడ్లు పట్టేందుకు ఫ్యాన్‌ను సరి చేస్తుండగా ఒక్కసారిగా ఆన్ కావడంతో ఈశ్వర్ తలకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వడ్లు తాలు పట్టేందుకు ఎలాంటి రక్షణ లేని ఫ్యాన్‌ను వినియోగించి ఈశ్వర్ మృతికి కారకుడైన రైతు వెంకట్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు.

# మూడు నెలల్లోనే కాంగ్రెస్‌పై తిరుగుబాటు

ఆరు గ్యారెంటీలు కాదు.. 420 మోసాలు

- అసమర్థపాలనతో ప్రజల అవస్థలు
- బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత
- బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలు కసితో ఉన్నారు..
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..
- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు: మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత, చిత్రంలో ఎమ్మెల్సీ సత్యవతి, శంకర్‌నాయక్, నాయకులు

గూడూరు/మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలై, తిరుగుబాటు చేస్తున్నారని, ఆ పార్టీకి ఓటేసి మోసపోయామని బాధపడుతున్నారని బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత అన్నారు. ఆదివారం గూడూరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో, అలాగే మహబూబాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో మానుకోట అర్బన్, రూరల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, వారు మ్యానిఫెస్టోలో పెట్టిన 420 హామీలు మోసమన్నారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతుబంధు ఇవ్వలేదన్నారు. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే ఆ కుటుంబాలకు బీమా కూడా రావడం లేదన్నారు. పింఛన్ల పెంపు మాటేమో గానీ, గతంలో తమ ప్రభుత్వం ఇచ్చినంత ఆసరా పింఛన్ కూడా ఈ జనవరి నెలలో ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనను చూసి ప్రజలే తమ వద్దకు వచ్చి బీఆర్ఎస్‌కు పట్టం కడుతామంటున్నారని, మళ్లీ కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నాడు మహబూబాబాద్‌కు కేసీఆర్ వస్తే ప్రజలు గంటల తరబడి వేచిచూసే వారని, నేడు సీఎం రేవంత్‌రెడ్డి వస్తే గంటల తరబడి సభా వేదిక వద్ద ప్రజల కోసం వేచి చూసే పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు ఈసడించుకుంటున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలతో అధికారంతో వచ్చిన వారి ప్రభుత్వానికే గ్యారెంటీ లేదన్నారు. మరోమారు సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కవిత కోరారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు అమలు గాని హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలు, కార్యకర్తలు కసితో ఉన్నారని, కవిత గెలుపు ఖాయమన్నారు. పట్టణాలు, గ్రామాలు, గూడేలు కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి చెందాయన్నారు. బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్ ఉందని, మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దన్నారు. అధికార మార్పిడి, కొత్త నాయకత్వం సహజమని, పార్టీ మారే నాయకుల గురించి ఆలోచించవద్దన్నారు. వారం రోజుల క్రితం మానుకోట వచ్చిన రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధికి ఏ హామీ ఇవ్వలేదన్నారు. గూడూరు నుంచి అధిక మెజార్టీ ఇస్తే దత్తత తీసుకుంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. కార్యకర్తలు అధైర్యపడద్దని, నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కేసీఆర్ తెలంగాణ సాధించకపోతే ఇప్పుడున్న సీఎం, మంత్రులు ఆ పదవులు అనుభవించేవారా అని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు మాట్లాడే భాష మార్చుకోవాలని హితవు పలికారు. ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికీ తిరిగి కేసీఆర్ పథకాలు వివరించి ఓటు అడగాలని, నియోజకవర్గంలో పార్టీకి అధిక మెజార్టీ తీసుకరావాలన్నారు. వచ్చే నెల ఒకటిన పార్టీ అధినేత కేసీఆర్ మహబూబాబాద్‌లో నిర్వహించే రోడ్ షోకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. గూడూరులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, మహేందర్, మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, ఎంపీటీసీ బోడ కిషన్, జలగం సంపత్ రావు, ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, వేణుమాధవ్‌రెడ్డి, రహీం, రామన్ననాయక్, మన్మోహన్‌రెడ్డి, సోమూనాయక్, కతార్‌సింగ్, కోడి రవి, వెంకన్న, గజ్జి యాకయ్య, సుధాకర్‌రావు, నర్సింహా, చందర్, బోడ ఎల్లయ్య, మహబూబాబాద్ జడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా, కేసన్ రెడ్డి, ఎండీ ఫరీద్, గద్దె రవి, గోకుల రాజు, మండల, అర్బన్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన కార్యకర్తలు

జైన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మతస్తులు

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ

గార్ల, ఏప్రిల్ 28. గార్ల మండల కేంద్రంలోని జైన్ ఆలయ నిర్మాణానికి జైన మతస్తులు ఆదివారం భూమి పూజ చేశారు. పాత ఆలయం శిథిలావస్థలో ఉండడంతో విరాళాలు సేకరించి నూతన ఆలయ నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రూప్‌చంద్ మహావీర్, విమాల్‌కుమార్ జైన, ఆకాశ్ జైన,పదం కుమార్, కిశోర్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వాహనం తనిఖీ

డోర్నకల్: డోర్నకల్ ఎస్సీ బీసీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఆదివారం మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ వాహనాన్ని చెక్‌పోస్టు సిబ్బంది తనిఖీ చేశారు. వెంట ఎంపీపీ డీఎస్ బాలూనాయక్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు చంటి, రహీం పాల్గొన్నారు.

# ఆమెకు 90.. ఆయనకు 85

- పెళ్లి చేసుకున్న వృద్ధ జంట
- నాడు గాంధర్వ వివాహం.. నేడు సంప్రదాయబద్ధంగా పెళ్లి
- కుటుంబ సభ్యుల నడుమ సంబురంగా వేడుక

వస్రంతండాలో వివాహం చేసుకుంటున్న వృద్ధ జంట

నెల్లికుదురు, ఏప్రిల్ 28: ఆమెకు 90 ఏళ్లు.. ఆయనకు 85 ఏళ్ల వయస్సులో వృద్ధ జంట పెళ్లి చేసుకున్న ఘటన నెల్లికుదురు మండలంలోని వస్రంతండాలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. తండాకు చెందిన 85 ఏళ్ల వయసు ఉన్న గుగులోత్ సమిడా, 90 ఏళ్ల గుగులోత్ లాలమ్మ దంపతులు 70 ఏళ్ల క్రితం గాంధర్వ వివాహం చేసుకున్నారు. వీరికి నలుగురు కుమారులు, కూతురు ఉన్నారు. ఐదుగురు మనుమళ్లు, 8 మంది మనుమరాళ్లు ఉన్నారు. మనుమడు గుగులోత్ యాకూబ్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధ దంపతులకు సంప్రదాయబద్ధంగా వివాహం జరిపించారు. ఈ పెళ్లి వేడుకను చూడడానికి తండావాసులు తండోపతండాలుగా తరలివచ్చారు.

# హనుమకొండకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

తొర్రూరు, ఏప్రిల్ 28 : హనుమకొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నిర్వహించిన రోడ్‌షోకు తొర్రూరు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి, తొర్రూరు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల నుంచి ప్రైవేట్ బస్సులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హనుమకొండకు తరలి వెళ్లారు.

తొర్రూరు: కేసీఆర్ రోడ్డు షోకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

### పెద్దవంగర నుంచి..

పెద్దవంగర: హనుమకొండలో ఆదివారం కేసీఆర్ నిర్వహించిన రోడ్ షో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, నాయకులు యాదగిరిరావు, సుధీర్‌కుమార్, సమ్మయ్య, షర్ఫొద్దీన్, భాస్కర్‌రావు, వెంకన్న, లక్ష్మయ్య, కృష్ణమూర్తి, నివాస్, అనుదీప్ పాల్గొన్నారు.

పెద్దవంగర: వరంగల్ రోడ్ షోకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

తొర్రూరు, ఏప్రిల్ 28 : మరిపెడ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిధిలో సోమవారం తాగునీటి సరఫరా నిలిచిపోతుందని మహబూబాబాద్ జిల్లా మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ సురేందర్ తెలిపారు. మరిపెడ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు నీటిని అందించే పాలేరు రిజర్వాయర్ వద్ద ప్రధాన పైపులైన్లకు సంబంధించి మరమ్మతు పనులు ఉన్నందున నీటి సరఫరా నిలిచిపోనుందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలతో పాటు వరంగల్ జిల్లా పరిధిలోని రాయపర్తి, నర్సంపేట డివిజన్‌లో సోమవారం తాగునీటి సరఫరా నిలిచిపోనుందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూచించారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 28: బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ డోలి లింగుబాబు, నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ తల్లి ఎల్లమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వారి కుటుంబాలను పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి, మహేందర్ చిట్యాల జనార్దన్, శంకర్, గోపీ పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LOST DOCUMENT**

★I, KUMMARI SANDEEP KUMAR, S/o. K.SAMPATH, H.No. 1-1-1191, Siddhartha Nagar, Babu Camp, Kazipet Mdl., Hanumakonda Dist., My Original Link Document No. 5363/2012 has been lost while Shifting from Fathima Nagar to Venkatadri Nagar, If found please cont. 9000075833. NTW-00

**WANTED**

★Wanted boys for car & bike wash for a reputed company. Contact Cell No. 7901691665. NTW-00

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899 NT-311840

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043. NTW-323227

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556 9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777554

JANGAON - 9182777565

పగిడిపల్లి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్

## అనుమతి లేకున్నా ఇసుక అక్రమ రవాణా

చిన్నగూడూరు, ఏప్రిల్ 28: మండలంలోని ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ఎలాంటి అనుమతి లేకుండా మన్నెగూడెం, విస్సంపల్లి, ఉగ్గంపల్లి గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అదికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కేసముద్రం, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి యాకూబ్‌రెడ్డి, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, గురజాల శేఖర్, టీ శ్రీనివాస్‌రెడ్డి, పుడకంటి సతీశ్, బూర స్వప్న, తోకల శ్రీలత, కవిత, రాజు,రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేసముద్రం: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## 40 ఏళ్లకు కలిసిన చిన్ననాటి విద్యార్థులు

నర్సింహులపేట, ఏప్రిల్ 28 : 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో కలుసుకొని సరదాగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు స్వామి, దక్షిణమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజు, రుద్ర, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, వెంకటేశ్వర్లు, యాకన్న, రంగారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, మూర్తి యామిని, లత, సంధ్య, కల్యాణి, రోజా పాల్గొన్నారు.

నర్సింహులపేట: కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## బయ్యారంలో అ 'పూర్వ' కలయిక

బయ్యారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, రఘూ, ఆర్‌వీ ప్రసాద్‌రావు, శ్రీధర్, పూర్వ విద్యార్థులు శ్రీను, మధు, రమేశ్, రామకృష్ణ, రమేశ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పెద్దవంగర, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు నిరంజన్‌రెడ్డి, నెహ్రూనాయక్, ప్రవీణ్‌రావు, మురళి, సైదులు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

## పేదింటి పెళ్లికి ఆర్థిక సాయం

బచ్చన్నపేట, ఏప్రిల్ 28: కొన్నె గ్రామానికి చెందిన కల్వకుంట్ల పోశయ్య, జ్యోతి కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. వీరిది పేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత కోడూరి శివకుమార్‌గౌడ్ వధూవరులను ఆశీర్వదించి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎలికట్టె శ్రీనివాస్, భిక్షపతి, నరేశ్, స్వామి, రాములు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు..

స్టేషన్ ఘన్‌పూర్: తాటికొండకు చెందిన బాణాల లక్ష్మి, అగాదం, చల్లా భిక్షపతి, పండుగ గట్టయ్య, దాసరి చంద్రయ్య ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలను వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. చల్లా భిక్షపతి, దాసరి చంద్రయ్య కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం అందించారు. కట్ట మల్లు, యాదగిరి, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

# బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

చిన్నగూడూరు, ఏప్రిల్ 28 : మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో బీజేపీ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ అధ్యక్షుడు కొండ బుచ్చయ్య, నాయకుడు వెంకన్నతోపాటు మరికొందరు బీఆర్ఎస్‌లో చేరగా, రెడ్యానాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, నాయకులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్